ప్రజాశక్తి
ఆదివారం 17 సెప్టెంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

20న 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన ఈనెల 20న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ మల్లికార్జునరావు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు గతంలో జిల్లా స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించే వారిని అయితే ప్రజలు చెంతకే కార్యక్రమాన్ని తీసుకెళ్లాలని ఉద్దేశంతో ప్రభుత్వం మండల స్థాయిలో జిల్లా అధికారులచే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున మండల వాసులు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతులను అందజేయవచ్చని, ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

జనసేన పొత్తుతో

● నెల్లిమర్ల, గజపతినగరం సీట్లు అడిగే అవకాశం?

టిడిపి ఆశావహుల్లో గుబులు

జనసేన పొత్తుతో ఉమ్మడి జిల్లాలో టిడిపి తరపున ఎమ్మెల్యే టిక్కెట్లు ఆశిస్తున్న వారిలో గుబులు మొదలైంది. జిల్లాలో జనసేన ఎక్కడెక్కడ ఎన్ని సీట్లు అడుగుతుంది? ఆ మాటకొస్తే ఉమ్మడి జిల్లా వరకు వస్తుందా? లేక కేటాయించిన కోటా సీట్లను మన జిల్లా కన్నా బలంగా ఉన్న విశాఖ, గోదావరి తదితర జిల్లాల్లోనే భర్తీ చేసుకుంటుందా? ఇదీ ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న చర్చ. ఎన్నికల పొత్తుపై ఇటీవల జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్లారిటీ ఇచ్చిన నేపథ్యంలో ఈ రకమైన చర్చ జిల్లాలో ముమ్మరంగానే సాగుతోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో జనసేన సొంతంగా గెలిచే శక్తిలేదు. పొత్తులో భాగంగా జిల్లాలో పోటీకి తలపడదామనుకుంటే నెల్లిమర్ల, గజపతినగరం నియోజకవర్గాలు గానీ, లేదా ఇందులో ఒకటిగానీ అడిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. విజయనగరం, బొబ్బిలిలో జనసేనకు చురుకైన నాయత్వం ఉన్నప్పటికీ ఈ రెండు చోట్ల టిడిపి నుంచి అత్యంత క్రియాశీలకంగా ఉంటూ పార్టీలో రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయగల నాయకులు ఉన్నారు. వీరిలో ఒకరు విజయనగరానికి చెందిన కేంద్ర మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు, బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీనాయన లేదా మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు ఉన్నారు. ఇద్దరు రాజవంశీయులను పక్కనబెట్టి రాజకీయాలు చేసే పరిస్థితి టిడిపిలో లేదు. అలాగని జనసేన పట్టుబట్టి అడగడానికి స్వయంశక్తి సరిపోని పరిస్థితి దాపురించింది.

గత ఎన్నికల్లో నెల్లిమర్ల నుంచి జనసేన పోటీలో నిలిచింది. కొద్దోగొప్ప పార్టీ కార్యకలాపాలతో నడుస్తోంది. గజపతినగరంలో మాజీ మంత్రి పడాల అరుణ ఇటీవల జనసేనలో చేరారు. చాలా కాలంగా కార్యకర్తలు ఉన్నారు. దీనికితోడు మిగిలిన నియోజకవర్గాలతో పోలిస్తే జనసేన హడావుడి కాస్త ఉందనే చెప్పుకోవచ్చు. ఈ రెండు నియోజవర్గాల్లోనూ టిడిపి నాయకుల్లో గ్రూపు రాజకీయాలు చాలా కాలంగా సాగుతున్నాయి. ఇక మిగిలిన నియోజకవర్గాల్లో ఇంతకన్నా బలంగా ఉన్న పరిస్థితేమీ లేదు. ఈ నేపథ్యంలోనే గజపతినగరం, నెలిమర్ల లేదా వీటిలో ఏదో ఒక నియోజకవర్గంలో పోటీకి జనసేన ప్రతిపాదన పెట్టే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో రెండు నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు, టిక్కెట్లు ఆశిస్తున్న ఇతర నాయకుల్లో లోలోపల గుబులు మొదలైంది. గజపతినగరం నుంచి టిడిపికి చెందిన మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు ఈసారి కూడా తనకే టిక్కెట్ వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఈసారి టిడిపి అధినేత చంద్రబాబు యువతకు ప్రాధాన్యత ఇస్తారని, ఆ లెక్కన తన కుమారుడికి వస్తుందంటూ అప్పలనాయుడు సోదరుడు కొండబాబు కొద్ది రోజులుగా ప్రచారం చేస్తున్నారు. ఈ హామీతోనే ఇటీవల అంతా కలిసి చంద్రబాబు వద్దకు వెళ్లామని కూడా తన సన్నిహితుల వద్ద చెప్తున్నట్టు సమాచారం. మరోవైపు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ జగపతిరాజు ద్వారా కరణం శివరామకృష్ణ కూడా ఎమ్మెల్యే టిక్కెట్ కోసం చాలాకాలంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటు నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఇటీవల నియమితులైన కర్రోతు బంగార్రాజు ఆశతో ఉన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు కూడా తన కుమారులకు టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జనసేనతో కుదిరిన పొత్తుతో ఈ రెండు నియోజకవర్గాలకు చెందిన ఆశావహుల రాజకీయ భవిష్యత్తు డైలమాలో పడినట్టేనన్న చర్చ నడుస్తోంది. జనసేన కోటా విజయనగరం వరకూ రాకపోతే ఏ సమస్యా ఉండకపోవచ్చని కూడా విశ్లేషకులు వెలువడుతున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం, వేదికపై నాయకులు సుబ్బరావమ్మ, రెడ్డి వేణు తదితరులు

ఎర్రజెండాతోనే గిరిజనాభివృద్ధి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు లోకనాథం, సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - కురుపాం

రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులను గిరిజనులు పొందాలంటే ఎర్రజెండాతోనే సాధ్యమని కోరన్న, మంగన్న స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని గిరిజనులంతా ఏకతాటిపైకి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడ్డానికి సిద్ధంగా ఉండాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, కె.సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిపిఎం నాయకులు మండగి రమణ అధ్యక్షతన జరిగిన కురుపాం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెరిగి సామాన్యులకు అందనంత దూరంలో ఉన్నాయన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ 9ఏళ్లలో ఉన్న ఉద్యోగాలు పీకేశారు తప్ప ఎక్కడా ఉద్యోగాలు వేసే పరిస్థితి లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎయిర్ ఇండియా, పోర్టులు, రోడ్లతో పాటు మైనింగ్, గనులు కార్పొరేట్, పెట్టుబడుదారులకు కారుచౌకగా అమ్మేస్తూ దేశ సంపదంతా మోడీ ప్రభుత్వం కొల్లగొడుతుందని అన్నారు.బిజెపి చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు మన రాష్ట్రంలోని అన్ని పార్టీలు పూర్తి మద్దతు ఇస్తున్నాయని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న విశాఖలో ఉత్తరాంధ్రలో బైక్ ర్యాలీ ప్రారంభమై 29 వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉక్కు రక్షణపై బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

ఉక్కు రక్షణయాత్ర ఉత్తరాంధ్ర బైక్ ర్యాలీ పోస్టర్‌ను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరామ్మ ,జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కె.గంగు నాయుడు, కె.అవినాష్, ఇందిర, నాయకులు ఎం.రమణ, ఎం.శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ ఉత్తరాంధ్ర బైక్ యాత్ర ఈనెల 24, 25 తేదీల్లో కురుపాం, సాలూరు, పార్వతీపురం పాలకొండ నియోజక వర్గాల్లో కొనసాగుతుంది. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రాల్లో సభలు జరుగుతాయి. ఈ సభలకు స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడే శక్తులన్నీ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా వై.మన్మధరావు, నియోజకవర్గంలో గల ఐదు మండలాల సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న జెసి గోవిందరావు

1520 మందికి 'కాపునేస్తం'

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 1520 మంది లబ్ధిదారులకు వైఎస్ఆర్ కాపు నేస్తం కింద రూ.2.28 కోట్లు ఆర్థిక సాయం అందింది. ఈ ఆర్థిక సహాయాన్ని శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. వైఎస్ఆర్ కాపు నేస్తం కింద కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు ఏడాదికి రూ.15 వేలను ఆర్థిక సహాయం అందించారు. వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు మాట్లాడుతూ జిల్లాలో వై.యస్.ఆర్ కాపు నేస్తం పథకం క్రింద 1520 మంది ఆర్థిక సహాయం చెక్కును పంపిణీ చేశారు. ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో నిర్వహించగా దాసరి కార్పొరేషన్ చైర్ పర్సన్ డాక్టర్ రంగుముద్రి రమాదేవి, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్‌ప్రసాద్, గండ్ల తెలుకలి కార్పొరేషన్ డైరెక్టర్ సి.హెచ్.వెంకట రమణ, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతి తిరుపతి, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, బిసి కార్పొరేషన్ ఎఇఒ గోపి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు గురుకులం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 21 నుంచి ఆచార్య రంగా యూనివర్సిటీలో జరగబోయే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ క్రీడలకు భద్రగిరి గురుకుల పాఠశాల నుంచి దివ్య, సంధ్య, సంజన విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సుబ్రమణ్యంతెలిపారు. ఎటిడబ్ల్యు సురేష్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ,మౌళి ఉన్నారు.

ఓటు అడిగే హక్కు మాకే ఉంది

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో ప్రజలను ఓటు అడిగే హక్కు వైసిపికే ఉందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పట్టణంలోని సీతారామ ధర్మశాలలో మున్సిపాలిటీ, మండలాలకు కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ శనివారం జరిగింది. మున్సిపాలిటీలో 134మందికి, మండలం లో 368మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. ఫించన్లతో పాటు జగనన్న విద్యా దీవెన, జగనన్న చేయూత,అమ్మ ఒడి, విద్యాకానుక, జగనన్న చేదోడు వంటి పథకాలను అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, కౌన్సిలర్లు, పట్టణ నాయకులు బాధ్యత వహించాలని కోరారు. గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మంతా ఒక్కో సచివాలయానికి రూ.20లక్షలు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేస్తే పట్టణంలోని సచివాలయాలకు రూ.40లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారని చెప్పారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ గొర్లి జగన్మోహన్ రావు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకష్ణ, కౌన్సిలర్ లు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలానికి కొత్తగా మంజూరైన పింఛన్లను డిప్యూటీ సిఎం రాజన్నదొర లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.ప్రమీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమం జరిగింది. మండలంలో కొత్తగా 375 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో జెడ్‌పి వైస్‌చైర్మన్ కె.సింహాచలం, వైస్ ఎంపిపి ఎం.నారాయణ, వీరంద్ర, ఎంపిడిఒ జి.పార్వతి, వైసిపి నాయకులు పి.వీరంనాయుడు, డోల బాబ్జీ, పి.గౌరీశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలానికి కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి శనివారం పంపిణీ చేశారు. ఎంపిపి ఉరిటి రామారావు అధ్యక్షతన వైయస్సార్ పింఛన్ కానుక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 8,222 వేల మందికి పింఛన్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎం. బాపూజీ నాయుడు ఎంపిడిఒ జి.పార్వతి, తహశీల్దార్ జివి జనార్ధన్, ఎంఇఒ నాగిరెడ్డి నాగభూషణరావు, న్యాయవాది కె.కూర్మినాయుడు, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : కొత్తగా మంజూరైన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం మండలంలోని నర్సిపురంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 2300 కొత్తగా పింఛన్లు మంజూరు కాగా, ఇందులో ఒక్క పార్వతీపురం మండలానికి 630 మంజూరయ్యాయని ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపిలు సిద్ధ జగన్నాధరావు, బంకరు రవికుమార్, ఎంపిడిఒ రమణమూర్తి, ఇఒపిఆర్‌డి ఎన్.కృష్ణుడు, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు భీమవరపు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి వి.గురురాజు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, పిఎసిఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీలో డిప్యూటీ సిఎం

సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఓజోన్ పొర ఆకారంలో కూర్చున్న కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులు

ఘనంగా ప్రపంచ ఓజోన్ డే

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఓజోన్ డే దినోత్సవాన్ని శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రామగోవిందం విద్యార్థులచే ఓజోన్ పొరను సూచిస్తూ కూర్చుని పెట్టి ఓజోన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొర ఆవశ్యకత తెలియజేసి ఎలా పరిరక్షించుకోవాలో విద్యార్థులకు వివరించారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వద్ద కూడా విద్యార్థులతో ఓజోన్ పొర ఆకారంలో కూర్చుని పెట్టి ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వసతి గృహ సంరక్షణ అధికారి కె. సూర్యనారాయణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: అతి నీలోహిత కిరణాల నుండి మానవజాతిని, ఇతర ప్రాణులను కాపాడుకోవాలంటే ఓజోన్ పొరను రక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ డే కళాశాలలో నిర్వహించారు. ఓజోన్ పొర భద్రంగా ఉండాలంటే అడవులను కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, కాలుష్యాన్ని నివారించాలని ఆయన కోరారు. కళాశాల నుంచి ఎల్విన్‌పేట వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ త్రినాధ, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

వీరఘట్టం : మండలంలోని ఓజోన్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓజోన్ అక్షర రూపంలో విద్యార్థులచే ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.లక్ష్మీ, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రధాన రహదారిపై నిలిచిన మురుగునీరు

వర్షం కురిస్తే అంతే!

రోడ్డుపై నీరు నిలిచిపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో వర్షం కురిసిన ప్రతిసారి ప్రధాన రహదారిలో చేరే వరద నీటితో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. పట్టణంలో పాత బస్టాండ్ కూడలి నుంచి సారికివీధి జంక్షన్ వరకు వర్షాకాలంలో వర్షం కురిసిన ప్రతిసారి వరద నీరు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉండే కాలువల్లోకి వెళ్లేందుకు మార్గం లేక ప్రధాన రహదారిపైనే పొంగిపొర్లుతూ వరద నీరు నిలిచిపోతుంది. ప్రతి ఏటా వర్షాకాలంలో ఈ సమస్య పునరావృతమవుతున్నప్పటికీ అటు అధికారులు గానీ, ఇటు ప్రజా ప్రతినిధులు గానీ సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయడం లేదు. శుక్ర, శనివారం మధ్యాహ్నం కురిసిన చిన్నపాటి వర్షానికి ప్రధాన రహదారిపై వరదనీరు నిలిచిపోవడంతో స్థానికులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రతి ఏటా పాలకవర్గం ఆమోదంతో మునిసిపల్ నిధుల నుండి లక్షలాది రూపాయలు వెచ్చించి కాలువల్లో పూడికతీతలు తీస్తున్నప్పటికీ ఫలితం లేకుండానే పోతుందని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలపై ఉన్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించి పూడికతీత పనులు చేపట్టి కాలువల వ్యవస్థను ఆధునీకరించితే తప్ప ప్రధాన రహదారిపై పొంగిపొర్లే వరద నీటి సమస్య పరిష్కారం కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం వైపు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాటు మున్సిపల్ పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు అధికారులు అడుగులు వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎగ'సాయ' సమావేశం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం కాస్త ఎగసాయ సమావేశంగా మారిందా? అంటే కచ్చితంగా అదే జరుగుతోందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవ పరిస్థితులపై చర్చ జరపకుండా, చర్చల్లోనూ సలహా మండలి సభ్యులు, చైర్మన్‌కు అవకాశం ఇవ్వకుండా ప్రజాప్రతినిధులే ఆధిపత్య ధోరణి చలాయిస్తుండటంతో ఇటీవల జరిగిన వ్యవసాయ, సాగునీటి సలహా మండలి సమావేశాలు మొక్కుబడిగానే ముగిశాయని రైతులు చర్చించుకుంటున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ఈ సమావేశాల్లో రైతుల తరపున ప్రాతినిధ్యం వహించే ప్రతినిధులు గానీ, చివరికి సలహా మండలి చైర్మన్ గానీ పెద్దగా మాట్లాడలేదు. మాట్లాడలేదనేకన్నా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదంటే బాగుంటుందేమో!. సమావేశం నిర్వహించిన తీరు ఇందుకు అద్దం పడుతోంది. సమావేశం మొత్తం జిల్లా పరిషత్తు చైర్మన్ తన కంట్రోల్‌లోకి తీసుకుని డిక్టేటింగ్ పద్ధతిలో నిర్వహిస్తే సామాన్యులు ఎలా తమ అభిప్రాయాలను చెప్పగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు. అందువల్ల జిల్లాలో వ్యవసాయ స్థితిగతులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటికి పరిష్కార మార్గాలపైనా, రైతులకు ఇవ్వాల్సిన సలహాలపైనా చర్చ జరగలేదని, అంతా రెండు గంటల్లో తూతూ మంత్రంగా ముగించారని రైతాంగం అసహనం వ్యక్తం చేస్తోంది.

వాస్తవంగా రైతులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలోకి ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యంగా రావడం, వర్షపాతంలో సమతుల్యత లేకపోవడం వంటి కారణాలతో ఖరీఫ్ పంటల సాగులో రైతులు వెనుకబడిపోయారు. ఉన్న కొద్దిపాటి సాగునీటి వనరులను కూడా ప్రభుత్వం సరిగా నిర్వహించలేకపోవడం, నిధుల కేటాయింపులకు మీనమీషాలు లెక్కించడం ఇందుకు కారణమని రైతులు చర్చిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలన్నీ కలుపుకుని 3,13,465 మేర సాగు కావాల్సి ఉంది. సీజన్ ముగింపు దశకు వచ్చినప్పటికీ 2,39,697 ఎకరాలకు మించి సాగవ్వలేదు. అదును తప్పిన వర్షాల కారణంగా జిల్లాలో మొక్కజొన్న 40 వేల ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది 24,055 ఎకరాల్లో మాత్రమే రైతులు నాటారు. చివరికి ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామంటున్న మిల్లెట్స్ సాగు కూడా 38,350 ఎకరాలకు గాను 22,617 ఎకరాల్లో మాత్రమే సాగైంది. సమయానుకూలంగా వర్షాలు కురవకపోవడం, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీరు అందకపోవడమే ఇందుకు కారణం. 64 వేల ఎకరాల స్థిరీకరణ ఆయకట్టుతో పాటు విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో మరో 1,46,221 ఎకరాలకు ఆదనంగా నీరందించాల్సిన తోటపల్లి జలాశయం లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించలేకపోతోంది. ముఖ్యంగా ప్రాజెక్టు, కుడికాలువ పనులు పూర్తిచేసినట్టు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పిల్లకాలువలు, స్ట్రక్చర్లు అసంపూర్తిగా ఉండడంతోపాటు ఇటీవల కాలంలో ప్రధాన కాలువల నిర్వహణ కూడా అధ్వానంగా మారింది. దీనికితోడు గడిచిన ఆరు నెలల్లో మూడు సార్లు సీతానగరం, బొబ్బిలి మండలాల్లో కాలువకు గండ్లు పడడం ఇందుకు తార్కాణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో, ప్రస్తుతం వరకు కేవలం 72 వేల ఎకరాలకు మించి నీరు అందడం లేదని అధికారిక గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా ప్రాజెక్టుకు చివర ఉన్న విజయనగరం జిల్లా నెల్లిమర్ల, చీపురుపల్లి, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు చుక్కనీరు కూడా అందడం లేదు. చీపురుపల్లి నియోజకవర్గంలో 25,121 ఎకరాలకు తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందాల్సి ఉండగా ఇప్పటి వరకు 17,252 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందినట్టు సమాచారం. ఇటువంటి నేపథ్యంలో 90 శాతం రైతులు వర్షపునీటి ఆధారంగానే ఎక్కువ శాతం ఉబాలు పట్టారు. సాక్షాత్తూ జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గం పరిధిలోని గడిగెడ్డ ద్వారా 2900 ఎకరాలకు సాగునీరు అందించాలి. ఈ ఏడాది గడిగెడ్డ జలాశయంలోకి చుక్కనీరు చేరలేదని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల వల్ల గొలుసుకట్టు చెరువులు ఇటీవల కురిసిన భారీ వర్షాల వరకు నిండని పరిస్థితి దాపురించింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని జలాశయాల కిందా ఇటువంటి పరిస్థితులు ఉన్నాయి. సాగునీటి సలహా మండలి సమావేశంలో సాగునీరు అందుతుందా? అని జెడ్పీ చైర్మన్ అడగడం, 'ఎస్ సార్..' అంటూ అధికారులు తలూపడం తప్ప వాస్తవికత బయటపడలేదు. అధికారిక లెక్కల ప్రకారం నాలుగు రోజుల క్రితానికి నెల్లిమర్ల నియోజకవర్గంలో 13,227 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, 1627 ఎకరాలకు సాగునీరు అందింది. వరుణుడు అదును తప్పించడం వల్ల కొంతమంది రైతులు పూర్తిగా మొక్కజొన్న వేయడం మానుకున్నారు. పూసపాటిరేగ మండలంలో 820 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా పట్టుమని పది మంది రైతులు కేవలం 25 ఎకరాల్లో మాత్రమే సాగుచేశారు. భోగాపురం మండలంలో 110 ఎకరాల్లో సాగుకావాల్సి ఉండగా ఒక్క ఎకరా కూడా సాగుకాలేదు. డెంకాడలో 415 ఎకరాలకుగాను 50 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఈ లెక్కలు మచ్చుకు మాత్రమే. దాదాపు అన్ని మండలాల్లోనూ అరకొరగాను, నామమాత్రంగానూ సాగయ్యాయి. చెరకు, పత్తి తదితర పంటల్లోనూ వెనుకబాటు ఉంది. మరోవైపు కౌలుదారులకు ఇప్పటి వరకు పంట రుణాలు ఇవ్వలేదు. సమావేశాల్లో ఇవేవీ పరిగణలోకి తీసుకోకపోవడం పట్ల సర్వత్రా అసంతృప్తి, అసహనం వ్యక్తమౌతోంది. సలహాలు, సాయాలకు బదులు ప్రభుత్వ సహకారం ఎగవేసే ధోరణిలో జిల్లా నేతలు వ్యవహరిస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

రాజన్నదొరకు వినతిని అందజేస్తున్న జ్యూట్‌మిల్ జెఎసి నాయకులు

జ్యూట్‌మిల్లు తెరిపించేందుకు కృషి చేయాలి
డిప్యూటీ సిఎంకు కార్మిక జెఎసి వినతి

ప్రజాశక్తి -సాలూరు

మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్లును 16 నెలలుగా యాజమాన్యం నిరవధికంగా మూసివేసిందని, తెరిపించేందుకు కృషి చేయాలని జ్యూట్‌మిల్లు కార్మిక జెఎసి డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొరను కోరింది. ఈ మేరకు శనివారం జెఎసి నాయకత్వం రాజన్నదొర నివాసంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఉపాధి నిచ్చే జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీ అని, దీన్ని తెరిపించడానికి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఇప్పటికే ఈ సమస్యను తహశీల్దార్, ఎసిఎల్ దృష్టిలో పెట్టినా యాజమాన్యం స్పందించలేదని తెలిపారు. డిప్యూటీ సిఎం కలుగజేసుకొని అటు యాజమాన్యం, ఇటు ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కరించి కార్మికులకు ఉపాధి చూపించేలా నిర్ణయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి ఈ సమస్యను నివేదించి, కార్మికుల పక్షాన ఉంటానని రాజన్నదొర తెలిపారు. కార్యక్రమంలో కార్మిక జెఎసి నాయకులు ఎన్వై నాయుడు, కె.శ్రీను, ఆర్.సింహాచలం, ఎన్.సింహాచలం, కె.నారాయణ, సూరప్పలనాయుడు, సుధ, తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు దుర్మార్గం

రిలే దీక్షలో మాజీ మంత్రి శత్రుచర్ల

ప్రజాశక్తి - కొమరాడ

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గపు చర్యని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న ప్రదేశంలో చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. చంద్రబాబుకు తోడుగా నేను అనే కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన కొనసాగుతుందన్నారు. టిడిపికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడును అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ రిలే దీక్షకు మండల జనసేన నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి, నియోజకవర్గ పరిశీలకులు, మండల అధ్యక్షులు ఎన్.శేఖర్ పాత్రుడు, నాయకులు సుదర్శన్ రావు మధుసూదన్ రావు, దేవకోటి వెంకట నాయుడు, జన సైనికులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట టిడిపి ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బేబినాయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకొని జగన్ మోహన్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలంతా సైకో పాలనపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ రిలే నిరాహార దీక్షలకు జనసేన మద్దతులిచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బి.రంజీవిలు, టిడిపి నాయకులు గర్భాపు ఉదయభాను, వాడాడ రాము, గొట్టాపు వెంకటనాయుడు, బలిజిపేట, సీతానగరం మండలాల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పి.వేణుగోపాల్ నాయుడు, కె.తిరుపతిరావు, బి.శ్రీనివాసరావు, జనసేన నాయకులు శ్రీనివాసరావు, చంటి తదితరులు పాల్గొన్నారు.


సీతానగరంలో దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న బేబినాయన

సీతంపేట: చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా సీతంపేటలో రెండో రోజు రిలేనిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న పాలకొండ నియోజకవర్గ నాయకులు పడాల భూదేవి మాట్లాడుతూ త్వరలోనే చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని, వైసిపీ అరాచక పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మిడి సింహాద్రి, పైల సత్తిబాబు, బిడ్డిక దమయంతి నాయుడు, మాజీ ఎంపిపిలు సవర మాలయ్య, ఆరిక లచ్చుమయ్య, సవర కంపి, సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు సవర గంగారావు, సవర సూర్యారావు, సవర గంగయ్య, సవర మంగయ్య, సవర కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

సంతకం చేస్తున్న మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు

పార్వతీపురం రూరల్ : జనసేన, టిడిపి పొత్తుతో వైసీపీలో వణుకు మొదలైందని, రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని రెండు పార్టీల పొత్తు కుదిరిందని ఆ పార్టీ నాయకులు అన్నారు. పట్టణ మెయిన్ రోడ్ లో టిడిపి చేపడుతున్న నిరసన దీక్షలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న వైసిపిని ఓడించేందుకు వచ్చే ఎన్నికల్లో జనసేన, టిడిపి కలిసి పోటీ చేస్తాయని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించినప్పటి నుంచి వైసిపి శ్రేణుల్లో వణుకు మొదలైందన్నారు. పదవిలో ఉన్న కొన్ని నెలలైనా ఒకసారి ఛాన్స్ ఇచ్చిన ప్రజల రుణం తీర్చుకునేలా పాలన సాగించాలన్నారు. కనీసం రోడ్డు గోతులనైనా కప్పేలా కష్టపడాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, రవాణా తదితర రంగాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. పెరుగుతున్న నిత్యవసర ధరలను తగ్గించి ప్రజలకు మేలు చేసేలా పాలన సాగించాలన్నారు. టిడిపి నాయకులు చేపడుతున్న నిరసన దీక్షకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు జి.రవికుమార్, కౌన్సిలర్లు బి.గౌరీ నాయుడు, కోల సరితా మధు, తాతపూడి వెంకట్రావు, కోరాడ నారాయణరావు, బర్నాల సీతారామారావు పాల్గొన్నారు. జనసేన నాయకులు వి.దాలినాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, పసుపురెడ్డి ప్రసాద్, తెంటు సురేష్, దువ్వాన మృత్యుంజయనాయుడు, గవర ఈశ్వరరావు తదితరులు మద్దతు తెలిపారు.

క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

క్విజ్ పోటీలో బిజెపురం హైస్కూల్ బాలికల ప్రతిభ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లా ఎయిడ్స్ ప్రివెంటేషన్, కంట్రోల్ యూనిట్ సౌజన్యంతో జిల్లా ఆరోగ్యశాఖ , జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో జియమ్మవలస మండలం బిజె పురం ఉన్నత పాఠశాల బాలికలు, జియ్యమ్మవలస హైస్కూల్ ఇద్దరు బాలురు ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. బిజె పురం హైస్కూల్ నుంచి ఎం.అభినయ (9వ తరగతి), సృజన(8వ తరగతి), జియ్యమ్మవలస హైస్కూల్ నుంచి ఎల్.లిఖిత్ ప్రేమ్ చంద్ (9వ తరగతి), యు.సాత్విక్ (8వ తరగతి) జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రశంసా పత్రంతో పాటు రూ. 4వేలు నగదు బహుమతి అందుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పూరిస్థాయిలో తాగునీరు సరఫరా చేయాలి

ప్రజాశక్తి -కొమరాడ

పాతకుళాయిల ద్వారానైనా పూర్తిస్థాయిలో తాగునీరందించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం కొమరాడలో గల రజకవీధిలో కొళాయిలను పరిశీలించిన రజకులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయానికి 200 మీటర్ల దూరంలో ఉన్న పాత బీసీ కాలనీలో రెండు రజక వీధులున్నాయని తెలిపారు. ఈ రజక వీధుల్లో కొద్ది రోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదన్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడంలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని లేకుంటే పెద్ద ఎత్తున రజక కుటుంబంతో కలిసి మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

నిర్మించిన గోడ

పాఠశాల ప్రహరీ నిర్మాణం
ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని నాగూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కూలిపోయిన ప్రహరీ గోడను అధికారులు పునర్‌నిర్మించారు. ప్రహరీగోడ కూలిపోయిన విషయమై ఇటీవల ప్రజాశక్తిలో వెలువడిన వార్తకు ఎంఇఒ ఎన్.నాగభూషణరావు స్పందించి మరమ్మతులు పనులు చేపట్టారు. పాఠశాల గోడ నిర్మాణంపై విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రజాశక్తికి ధన్యవాదములు తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఈనెల 11నుండి 30 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి పర్యవేక్షణలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి 14మంది విద్యార్థులకు దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించి వారికి కళ్ల జోళ్లకు సిఫార్సు చేసినట్లు ఆయన తెలిపారు. త్వరలో జరగనున్న జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాల్లో కళ్ల జోళ్లు పంపిణీ చేస్తామన్నారు. అలాగే ఇతరత్రా వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి విద్యార్థులకు నేత్ర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేత్రదానంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగన్నాధరావు మాట్లాడుతూ నేత్ర పరీక్షలు విద్యార్థులంతా చేయించుకోవాలని, తద్వారా కంటి చూపు కాపాడుకోవడానికి శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరప్రసాదరావు, కంటి వైద్య సహాయకులు ఉమా మాహేశ్వరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ జెకెపాడులో మహిళా సంఘ సభ్యులకు, రైతు మిత్ర సంఘాలకు ప్రకృతి వ్యవసాయంపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చీడపీడల నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కషాయాలు చేయు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో విఒఎలు రాజేశ్వరి, దీప, పద్మ, చందన, అగ్గన్న తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జెఎఎస్ శిబిరాల పట్ల అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పాలకొండ/వీరఘట్టం

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) శిబిరాల పట్ల ప్రజలకు విస్తత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వీరఘట్టం, పాలకొండ మండలాల్లో ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఇతర వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే, పరీక్షలను శని వారం ఆయన తనిఖీ చేశారు. ఇంటింటి విచారణలో భాగంగా పరిశీలించిన వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎఎస్‌తో ప్రతీ కుటుంబానికి అత్యుత్తమ వైద్యం అందుతుందన్నారు. ఈ నెల 30 నుండి ప్రారంభం కానున్న వైద్య శిబిరాలకు 2, 3 రోజుల ముందే సంసిద్ధం చేయాలని చెప్పారు. శిబిరం నిర్వహించే తేదీ, సమయం, వైద్య నిపుణుల వివరాలు, ఉచిత పరీక్షలు గురించి తెలియజేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటినీ సర్వే నిర్వహించి ఇంటి వద్ద ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ కె.తేజ్ రతన్ రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని నిడగల్లు గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని రకాల వ్యాధులపై ఇంటి సర్వే జరుగుతుందని, ఈ సర్వేలో గుర్తించిన ఆరోగ్య సమస్యలను గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, గ్రామ పెద్దలు శ్రీనివాసరావు, తిరుపతి నాయుడు, గ్రామ వాలంటీర్లు, గృహసారధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని బూర్జలో వైద్య బృందం,గ్రామ వాలంటీర్లు చేపడుతున్న జెఎయస్ ఇంటింటి ఆరోగ్య సర్వేను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటిలో ఉన్న ప్రతి వ్యక్తికీ వారి ఆరోగ్య స్థితిని అనుసరించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. వైద్య పరికరాల పని తీరును తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ కరపత్రాలను వివరిస్తూ ప్రతీ ఇంటికి వైద్య సిబ్బంది అందజేశారు. ఎఎన్ఎం, సిహెచ్ఒ, వాలంటీర్లు జెఎఎస్ యాప్‌లో ఇచ్చిన ఆరోగ్య అంశాలను కుటుంబంలో ప్రతి ఒక్కర్నీ అడిగి నమోదు చేయాలన్నారు. ప్రజలంతా జెఎఎస్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పెదంకలాం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.రాధాకాంత్, బూర్జ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ హేమాక్షి , వైద్య సిబ్బంది గోపి, నరసమ్మ,గాయత్రి, ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

జెఎఎస్ ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

పిల్లలందరికీ పూర్తిస్థాయిలో టీకాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా టీకాల నిర్వహణ జరుగుతుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మిషన్ ఇంద్ర ధనుష్‌లో భాగంగా శనివారం ఆయన కోటవానివలస, బంటువానివలస పరిసరాల్లో తాత్కాలిక జీవనం సాగిస్తున్న వలస కార్మికుల స్థావరాలను సందర్శించి అక్కడ ఐదేళ్ల లోపు పిల్లలు, గర్భిణులకు టీకా నిర్వహణ ఏ మేరకు జరిగిందీ పరిశీలించారు. అక్కడ పిల్లల టీకా కార్డులను ఆయన పరిశీలించి సకాలంలో టీకాలు పొందారో, లేదో తేదీలను గమనించారు. వీరికి వేయబడిన టీకాల ఆన్లైన్ నమోదును పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ పిల్లలందరికీ పూర్తి స్థాయిలో టీకాలు వేయడమే మిషన్ ఇంద్ర ధనుష్ ఉద్దేశ్యమని, శనివారం నాటికి రెండో విడత పూర్తయ్యిందని అన్నారు. ముఖ్యంగా హైరిస్క్ ప్రాంతాలైన వలస కార్మికులు, తాత్కాలిక జీవనం కొనసాగించే ప్రాంతాల్లో పిల్లలు పూర్తి స్థాయిలో టీకాలు పొందలేక పోయే అవకాశం ఉంటుందని, ఇలాంటి వారిని గుర్తించి టీకాలు వేయిస్తున్నామని అన్నారు. తద్వారా టీకా నిరోధక రోగాలు బారిన పడకుండా పిల్లల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని అన్నారు. అనంతరం ఆయన పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలకు గాని, వారికి గానీ ఆరోగ్యపరంగా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకొని వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు నాగమ్మ, జయగౌడ్, వైద్య సిబ్బంది శాంతి, శ్రావణి సంధ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎగువమండ గెడ్డ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న పరీక్షిత్ రాజు

ఎగువమండ వంతెన నిర్మిస్తాం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎగువ మండకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు హామీ ఇచ్చారు. తన పర్యటనలో భాగంగా శనివారం ఎగువమండలో కల్వర్టును పరిశీలించారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు గెడ్డ వాగు ప్రవాహం పెరగడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రోగుల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని గ్రామస్తులు వివరించారు. పదేళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు భారీ వర్షాలకు కొట్టుకుపోయిందన్నారు. నాటి నుంచి నేటి వరకు దాని స్థానంలో వేరే కల్వర్టు నిర్మించకపోవడంతో కొన్నేళ్లుగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్య విన్న పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఎంపిపి కుంబిరిక దీనమయ్య, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లేష్ మృతి పార్టీకి తీరని లోటు

వైసిపి కార్యకర్త, సచివాలయ కన్వీనర్ మల్లేష్ ఆకస్మికంగా మృతి చెందడం పార్టీకి తీరని లోటని వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అన్నారు. ఎగుమండ గ్రామాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మల్లేష్ పంచాయతీలో పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కొంత నగదును ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె. దీనమయ్య , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల న్యాయవాది బొజ్జా తారకం

ప్రజాశక్తి - సాలూరు

దళిత, గిరిజనుల,పేదల తరపున వాదించిన న్యాయవాది బొజ్జా తారకమని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. శనివారం బొజ్జా తారకం వర్ధంతి సందర్భంగా రాజన్నదొర నివాసంలో బొజ్జా తారకం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో బొజ్జా తారకం సాధించిన విజయాలు ఎప్పటికీ మర్చిపోలేనివని చెప్పారు. సామాన్య గిరిజనుడిగా తాను వేసిన కేసులో ఆయన ఎంతగానో శ్రమించారని చెప్పారు. ఆయన లేకపోతే తానులేనని చెప్పారు. మొదటిసారి ఎన్నికల్లో ఓడిపోయిన సందర్భంలో తాను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని, కొంతమంది మిత్రుల సహకారంతో బొజ్జా తారకం కృషి కారణంగానే ఈరోజు డిప్యూటీ సిఎం హెూదా లో వున్నానని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, రిపబ్లికన్ పార్టీ నాయకులు గొంప ప్రకాశరావు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం న్యాయ సలహాదారు రేగు మహేష్, కౌన్సిలర్ లింగాల దుర్గా, మధుసూదనరావు, మాజీ కౌన్సిలర్ ఎం.అప్పారావు పాల్గొన్నారు.

రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

లక్ష్మీపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషయన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.రాధాకాంత్ మాట్లాడుతూ బిపి, షుగర్, జనరల్ ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి తనిఖీలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గుర్తించి వారికి కూడా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఎం.ఎల్ కీర్తి, ఎఎన్ఎం బి.రమాదేవి, ఆశా కార్యకర్త టి.రమాదేవి పాల్గొన్నారు.

గడగమ్మలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గడగమ్మలో 104 ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఎఎన్ఎం వై.రాజేశ్వరి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మండల ఇంజినీరింగ్ అధికారి డి.కల్యాణదుర్గ గుత్తేదారును ఆదేశించారు. శనివారం స్థానిక చేపల మార్కెట్ నుంచి పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రహదారి సిసి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. అభివద్ధి పనుల్లో ఉదంతలు రాకుండా పనులు చేపట్టాలని గుత్తేదారుకు సూచించారు.

అనారోగ్యంతో బేస్ క్యాంప్ గార్డ్ మృతి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో బేస్ క్యాంప్ గార్డుగా విధులు నిర్వ హిస్తున్న రౌతు కోటి అనా రోగ్యంతో శని వారం మృతి చెందాడు. ఆయన బంధు వులు అందించిన వివ రాలు ప్రకారం పెదమేరంగికి చెందిన ఆయన్ను ఏనుగుల పర్యవేక్షణ విధుల్లో నిరంతరం శ్రమించి అనారోగ్యం పాలై శనివారం తన ఇంటి నుంచి పార్వతీపురం ప్రైవేట్ ఆస్పత్రికి వైద్యానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు.

ఆరోగ్యవంతమైన పంట కోసం నిరంతర పర్యవేక్షణ

ప్రజాశక్తి - పాచిపెంట

ఆరోగ్యకరమైన పంట పండించాలంటే నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని, వాతా వరణంలో మార్పులు, చీడపీడలు, భూమిలో తేమ శాతం నీటి యాజమాన్యం అంటే పద్ధతులను పరిశీలిస్తూ ఉండాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లిలో విఎఎ నాగమణి ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ వరి పంట పొలంబడి కార్యక్రమంలో మాట్లాడారు. రైతులు పంట వాతావరణంపై అవగాహన కలిగి మిత్ర, శత్రువు పురుగులను గుర్తించి పురుగుమందుల పిచికారీపై అవగాహన కలిగించుకోవాలని తెలిపారు. పంటల యాజమాన్యంలో ఎరువులు, తెగుళ్ల అతి ముఖ్యమైనవన్నారు. ఈ సందర్భంగా రైతులకు యూరియా అవసరాన్ని సూచించే గ్రీన్ లీఫ్ కార్డులపై అవగాహన కల్పించారు. బాగా ముదురు ఆకుపచ్చ రంగులో పంట ఉంటే యూరియా శాతం ఎక్కువైనట్లుగా భావించాలని, లేత పసుపు రంగులో ఉంటే యూరియా శాతం తగ్గిందని భావించి నిర్ణయాన్ని తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు

వండవలో గడపగడపకు...

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవలో స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు పొంది కుటుంబ సమేతంగా సంతోషంగా ఉన్నట్లు ఆమె స్పష్టం చేశారు. రాజకీయ అతీతంగా వాలంటీర్ల ద్వారా సంక్షేమం పథకాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలోనే సమస్య పరిష్కారం కావాలని ఉద్దేశంతోగ్రామాల్లో సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గూర్చి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.కల్యాణి, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు పి.విజయ కుమారి, పాలకొండ ఏఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, చిదిమి సర్పంచి డిజఉమామహేశ్వరరావు, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు జి.బలరాంతో పాటు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అంత్యక్రియలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న కృష్ణమూర్తి, హెచ్ఎం

స్థానిక కేంద్రాసుపత్రిలో మరణించిన, నిరుపేద కుటుంబానికి చెందిన శవానికి శనివారం కొంత మంది దాతల సహకారంతో అంత్యక్రియలు జరిపిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కొమరాడ మండలం కొట్టు గ్రామానికి చెందిన తుంపలపుర్రు నారాయణ (40) రాజమండ్రి దగ్గర హెూటల్‌లో కూలీగా పని చేస్తున్నాడు. రాజమండ్రిలో భార్య పుష్ప, కొడుకు సాయితో నివాసం ఉంటున్నాడు. కొట్టు గ్రామంలో ఉంటున్న తన తమ్ముడు చనిపోయాడని గ్రామస్తులు ఫోన్ చేసి తెలియపర్చగా వారం క్రితం గ్రామానికి వచ్చాడు. తమ్ముడి అంత్యక్రియలు అనంతరం నారాయణ అనారోగ్యానికి గురి కావడంతో భార్య, కొడుకు జిల్లా ఆసుపత్రికి తీసుకొని వచ్చి 5 రోజులు క్రితం జాయిన్ చేశారు. చికిత్స పొందుతూ శనివారం ఆసుపత్రిలో మృతి చెందాడు. నారాయణ కర్మకాండ చేయడానికి బంధువులు ఎవరూ లేరు. పేదవారైన భార్య, కొడుకుకు దిక్కుతోచక ఏం చేయాలో తెలియదు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కె. కృష్ణమూర్తి రూ.2వేలు దహన ఖర్చుల నిమిత్తం ఆసుపత్రికి వచ్చి అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. అలాగే జిల్లా ఆసుపత్రిలో డైట్ ఇంచార్జి సరివిశెట్టి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు గొర్లి మాధవరావు, ఆశా అంబులెన్స్ యజమాని కోట రమేష్, ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సహయం అందచేయగా అంత్యక్రియలు పూర్తిచేశారు.

మనస్తాపంతో బావిలోపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

మండలంలోని బాలగొడబకు చెందిన నల్ల రామినాయుడు (53) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన బావిలో పడి మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం గ్రామంలో తేలిఉన్న శవాన్ని పరిశీలించగా, మృతుడు రామినాయుడదని తేలింది. ఆయన స్వస్థలం బాలగొడబ అయినప్పటికీ భార్య, ఇద్దరు పిల్లలుతో విశాఖలో కూలీపనులు చేస్తూ జీవిస్తున్నాడని, కుటుంబకలతల వల్ల మనస్థాపంతో ఆత్మహత్యకు ప్రయత్నించి ఉంటాడని గ్రామస్తులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్తుల సహకారంతో శవానికి పంచనామా జరిపించి, పోస్టుమార్టానికి తరలించారు.

బావిలో తేలియాడిన రామినాయుడు మృతదేహం